ఎఫ్‌టీఎల్‌ పరిధిలో అక్రమ నిర్మాణాలు!

- గతంలో చెరువును పరిశీలించి చర్యలు తీసుకోని అధికారులు
- చెరువుకట్ట రేలింగ్‌ తొలగించిన వ్యాపారులు
- రిటర్నింగ్‌ వాల్‌ పనులను అడ్డుకున్న అక్రమ నిర్మాణదారులు


చెరువు కట్ట ముందు ఎఫ్‌టీఎల్‌, అసైన్డ్‌ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌ హస్మత్‌పేట్‌ బోయిన్‌ చెరువు చుట్టూ ఉన్న ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ జోన్‌లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. చెరువు సుందరీకరణలో భాగంగా ఒక వైపు ఫుట్‌పాత్‌ను ఏర్పాటు చేశారు. నాలుగు ఫీట్ల గోడ, రేలింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికీ మరోవైపు అంటే చెరువు ముందు భాగంలో ఎఫ్‌టీఎల్‌, అసైన్డ్‌ ల్యాండ్‌కు 30 మీటర్ల వరకు వదిలి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. చెరువు కట్టకు ఆనుకుని చెరువు కట్ట పొడవు అక్రమంగా బహుళ అంతస్తులు నిర్మించి, వ్యాపారాలు నిర్వహించుకునేందుకు షాపులను ఏర్పాటు చేశారు. కట్టకు ఆనుకుని ఉన్న పైపులైన్‌ను తొలగించి రాకపోకలు సాగేలా ఏర్పాటు చేసుకున్నారు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు అటు వైపు చూడటం లేదు. ముందు వైపు నిర్మాణం చేపట్టి.. సున్నం వేసి వెనుక వైపు భాగంలో పనులు చేస్తుండటం పరిపాటిగా మారింది. ఒక పక్క చెరువు కట్టపై అక్రమంగా వాహనాల పార్కింగ్‌, మరోపక్క అక్రమ నిర్మాణాలతో ఎఫ్‌టీఎల్‌ పూర్తిగా కనిపించకుండా పోయింది. గతంలో లేక్‌ ప్రొటక్షన్‌ సెల్‌ అధికారులు చెరువు కట్ట ఎఫ్‌టీఎల్‌ పరిధిలో నిర్మాణాలను పరిశీలించారు. కూల్చివేతలకు చర్యలు తీసుకున్నప్పటికీ వారు వెనుకడుగు వేసినట్లు తెలుస్తోంది.

పరిశీలించిన హైడ్రా అధికారులు

గతంలో చెరువుల ఆక్రమణలపై హైకోర్టు సుమోటోగా తీసుకున్న 5 చెరువులలో బోయిన్‌ చెరువు కూడా ఒకటి. అప్పట్లో బోయిన్‌ చెరువును హైడ్రా అధికారులు పరిశీలించారు. అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చెరువుల పరిరక్షణలో భాగంగా ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ జోన్లలో నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులకు హస్మత్‌పేట బోయిన్‌ చెరువు ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ జోన్లలో వెలిసిన భవనాలు కనిపించడం లేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన నిర్మాణదారులు ఒక్కడుగు ముందుకేసి కట్టకు ఉన్న పైపులను తొలగించి వారి మడిగెలకు దారులను ఏర్పాటు చేసుకున్నారు. అయినా అధికారులు స్పందించకపోవడం విశేషం.

పనులను అడ్డుకున్న అక్రమ నిర్మాణదారులు!

హస్మత్‌పేట చెరువు కట్టకు ఒక వైపు ఫుట్‌పాత్‌ను ఏర్పాటు చేసి రిటర్నింగ్‌ వాల్‌ ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ రూ. కోటి నిధులను మంజూరు చేసి కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించింది. శనివారం సంబంధిత కాంట్రాక్టర్‌ జేసీబీతో పనులను మొదలు పెట్టారు. దీంతో రిటర్నింగ్‌ వాల్‌ ఏర్పాటు చేస్తే తాము ఇబ్బందులు పడతామని, చెరువు కట్ట కింద దారి నుంచి రావాల్సి ఉంటుందని పనులకు అడ్డు చెప్పారు. 10 మంది నిర్మాణదారులు ఓల్డ్‌ బోయిన్‌పల్లికి ఓ ప్రైవేట్‌ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే కృష్ణారావును కలవడానికి ప్రయత్నించారు. కానీ ఎమ్మెల్యే తొందరగా వెళ్లిపోవడంతో స్థానిక కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. రిటర్నింగ్‌ వాల్‌ కట్టవద్దని కోరారు. దీనికి ఆయన స్పందించి.. చెరువు అభివృద్ధిలో భాగంగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. సోమవారం ఎమ్మెల్యేతో పాటు తాను చెరువు కట్ట అభివృద్ధి పనులను పరిశీలిస్తామన్నారు. పనులకు అడ్డు పడుతున్న వారితో కూడా చర్చిస్తామని తెలిపారు.


చెరువు కట్ట పైపులను తొలగించి దుకాణాలకు దారులు చేసుకున్న అక్రమ నిర్మాణదారులు

లో ప్రెషర్‌ సమస్యకు పరిష్కారం



మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని పర్వత్‌నగర్‌లో శనివారం కార్పొరేటర్‌ సబిహా బేగం జలమండలి మేనేజర్‌ అన్విత్‌తో కలిసి మంచినీటి లో ప్రెషర్‌ సమస్యను పరిష్కరించారు. కొద్ది రోజులుగా మంచినీటి సరఫరా లో ప్రెషర్‌తో వస్తున్నదని స్థానికులు ఆమె దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు మంచినీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బోర్‌వెల్‌ పనులు ప్రారంభం



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో బోర్‌వెల్‌ పనులకు శనివారం బీఆర్‌ఎస్‌ శేరిలింగంపల్లి సీనియర్‌ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు ఆలయ ధర్మకర్త శ్యామలా భాస్కర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, సమ్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, సాంబమూర్తి, ఎండీ ఇస్మాయిల్‌, సాయిగౌడ్‌, తేజ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేడు శత జయంతి వేడుక

మోతీనగర్‌: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరీ శారద శంకర మఠములో పౌరాణిక సార్వభౌమ మల్లాది చంద్ర శేఖర శాస్త్రి శత జయంతిని నిర్వహించనున్నారు. ఆదివారం 5 గంటలకు విశేష సభ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మాధికారి సీఎస్‌ఆర్‌ మూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

'సండే ఈవినింగ్‌ టాక్‌'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్‌ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌ క్యాంపస్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్‌ టాక్‌ కార్యక్రమం నిర్వహిస్తారు.సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది. ఈ సందర్భంగా 'ట్రిపుల్‌ ఫిల్టర్‌ టెస్ట్‌' అనే అంశంపై బ్రహ్మకుమారీస్‌ కోకాపేట్‌ బ్రాంచ్‌ కోఆర్డినేటర్‌, సీనియర్‌ రాజయోగ టీచర్‌ బి.కె.రుచి ఉపన్యసిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్‌ నంబర్‌ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

చందానగర్‌: శేరిలింగంపల్లి మండలంలోని మదీనాగూడ సర్వే నంబర్‌– 75 ప్రభుత్వ స్థలంలోని 160 గజాల స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో శనివారం మండలం రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌ నేతృత్వంలో కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల తహశీల్దార్‌ వెంకారెడ్డి ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను తొలగించామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించొద్దు



నిజాంపేట్‌: మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని బీఆర్‌ఎస్‌ విప్‌, ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. శనివారం నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన కార్పొరేషన్‌ పరిధిలోని అభివృద్ధి పనుల పురోగతిపై వివిధ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేట్‌ కార్పొరేషన్‌లోని పలు డివిజన్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఇప్పటికే పలుమార్లు ప్రత్యేకంగా క్షేత్రస్థాయిలో పర్యటించామని తెలిపారు. ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో నిజాంపేట్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ సాబేర్‌ అలీ, డిప్యూటీ ఎమ్మార్వో, వాటర్‌ వర్క్స్‌, విద్యుత్‌ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కలిసి పని చేద్దాం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు అందరం కలిసి పని చేద్దామని ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జిల్లా పరిషత్‌ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దుండిగల్‌ ఎంఈఓ కృష్ణ, మండల్‌ రిసోర్స్‌ పర్సన్‌ రమేష్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యప్రదర్శన



మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం డాక్టర్‌ వినీలరావు శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఇందులో గణేశ పంచరత్న, బ్రహ్మాంజలి, శివతాండవం, బృందావన నిలయే, రామాయణశబ్దం, జతిస్వరం, బాలగోపాల తారంగం, కొలువైతివా రంగసాయి, భోశంభో, దశావతారం తదితర అంశాలను కళాకారులు రుత్విజ, శాన్వి, వివేకా, సమ్రితి, ఆరాధ్య, సిరి, చందన, గౌతమి, శిరీష, రితిక, విశీత, సింధు, సాయి సరయు, వైష్ణవి, చరితకృష్ణ, స్రవంతి, దివ్య, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రద్ధ యలమర్తి సంగీత కచేరీతో సందర్శకులను అలరించారు. గణరాజ గణరాజ, తాళ్ళపాక అన్నమాచార్య, కొండ చూదము రారో, చిత్తము కొలది, వేడుకుందామా, పసిడి ఉయ్యాల అన్నమయ్య కీర్తనలను ఆలపించి ఆకట్టుకున్నారు. వీరికి కీ బోర్డుపై శ్రీనివాస్‌, తబలాపై అజయ్‌ సంగీత సహకారాన్ని అందించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌ రెడ్డి, అధికారులు

బాలానగర్‌: చెరబండ రాజు నగర్‌లో ఉన్న మాల జంగం కులస్తుల శ్మశాన వాటికలో వసతుల కల్పనకు శనివారం కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్‌ విభాగం ఏఈ ఆశ, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రాములు, బీఆర్‌ఎస్‌ నాయకులు మందడి సుధాకర్‌ రెడ్డి, పంజా రాంచందర్‌, ఖాజా, దేవులపల్లి కృష్ణమూర్తి, రత్నం, ప్రేమ్‌ కుమార్‌, చెరబండ రాజు నగర్‌ అధ్యక్షులు సంద్రా సునీల్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో పండ్లు, మిఠాయిల పంపిణీ



మోతీనగర్‌: పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌ కుమార్‌ గౌడ్‌ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్‌ పార్టీ గ్రేటర్‌ హైదరాబాద్‌ ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్‌ శనివారం మోతీనగర్‌లోని జయ హోం ఫర్‌ చిల్డ్రన్స్‌ ఆశ్రమంలో కేక్‌ కట్‌ చేశారు. చిన్నారులకు మిఠాయిలు, పండ్లు, పెన్నులు, నోట్‌ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో గంట మల్లేష్‌, సాల్మన్‌, యాకమ్మ, లక్ష్మి, రాజమణి, ఉమా, మధు గౌడ్‌, హనుమంతరావు, నరేష్‌ గౌడ్‌, సుభాష్‌ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నిజాంపేట్‌: ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కమిషనర్‌ సాబేర్‌ అలీ అన్నారు. మున్సిపల్‌ కార్పొరేషన్‌లోని 13, 14 డివిజన్‌లలో శనివారం పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చే ప్రతీ సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు కొలన్‌ శ్రీనివాస్‌రెడ్డితో, మున్సిపల్‌ సిబ్బంది కుమార్‌ యాదవ్‌, శ్రీశైలం యాదవ్‌, కాంగ్రెస్‌ ఎస్‌ఎంసీ మహిళా అధ్యక్షురాలు ఇందిరా, లింగాల గంగాధర్‌, మామిళ్లపల్లి శ్రీనివాస్‌, కృష్ణంరాజు, వర్మరాజు, శ్రీదేవి, పంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిర్మించి ఇవ్వాలి

మూసాపేట: మూసాపేట చౌరస్తా నుంచి ఆంజనేయనగర్‌ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణలో షాపులను కోల్పోయిన బాధితులకు షట్టర్లు నిర్మించి ఇవ్వాలని కార్పొరేటర్‌ కొడిచెర్ల మహేందర్‌ కోరారు. ఈ మేరకు జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులకు ముందస్తు సమాచారం ఇస్తే వ్యాపారులకు ఆస్తి నష్టం జరగకుండా ఉండేదన్నారు. గతంలో కేంద్రమంత్రిగా ఉన్న బండారు దత్తాత్రేయ 8 మంది షాపులకు అనుమతులు ఇచ్చి పెట్టించారని గుర్తు చేశారు. 15 సంవత్సరాలుగా వ్యాపారం చేసుకుంటున్న ఆ కుటుంబాలకు జీహెచ్‌ఎంసీ స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బాసెట్టి నర్సింగ్‌రావు, షాపు ఓనర్లు, బీజేపీ సీనియర్‌ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, కృష్ణయాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.


జోనల్‌ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్‌ మహేందర్‌ తదితరులు

స్పీడ్‌ బ్రేకర్ల నిర్మాణం


స్పీడ్‌ బ్రేకర్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ప్రమాదాల నిరవాణ కోసం స్పీడ్‌ బ్రేకర్ల నిర్మాణం చేపట్టినట్లు కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని ఉషా ముళ్లపూడి ప్రధాన రహదారిలో తులసివనం వద్ద ట్రాఫిక్‌ రద్దీ ఎక్కువగా ఉండి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో స్పీడ్‌ బ్రేకర్‌ ఏర్పాటు చేయాలని అపార్టుమెంట్‌ వాసులు కార్పొరేటర్‌ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సమస్యను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకువెళ్లి సంబంధిత అధికారులతో చర్చించి స్పీడ్‌ బ్రేకర్‌ నిర్మాణ పనులు మొదలు పెట్టారు. కార్యక్రమంలో ఎంఆర్‌కె రెడ్డి, శ్రావణ్‌కుమార్‌, నాగ కృష్ణ, హరికిషోర్‌, తులసివనం అపార్టుమెంట్‌ వాసులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలలను తల్లిదండ్రులకు అప్పగింత





బాలానగర్‌: రాత్రి సమయంలో తప్పిపోయిన ఇద్దరు బాలలను రెండు గంటల వ్యవధిలోనే గుర్తించి పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. బాలానగర్‌ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ టి. నరసింహరాజు వివరాల ప్రకారం.. ఈ నెల 23న రాత్రి 9 గంటల సమయంలో చెరబండ రాజు నగర్‌లో నివాసం ఉంటున్న చిన్నారి తనుష్‌ (3) బాలానగర్‌ మెయిన్‌ రోడ్డులోని బీబీఆర్‌ ఆసుపత్రి వద్ద ఏడుస్తూ బాలానగర్‌ పెట్రో పోలీస్‌ సిబ్బందికి కనిపించాడు. బాలుడిని బాలానగర్‌ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుని ఫొటోను స్థానికంగా ఉన్న కాలనీల అసోసియేషన్‌ వాట్సాప్‌ గ్రూపుల్లో పోస్ట్‌ చేశారు. సమాచారం రావడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు రాత్రి 11 గంటలకు స్టేషన్‌కు వెళ్లడంతో బాలుడిని పోలీసులు అప్పగించారు.

మరోచోట..

గిరినగర్‌కు చెందిన రావి రోహిత్‌ (10) రాత్రి 8 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చి తప్పిపోయాడు. తల్లిదండ్రులు బాలానగర్‌ పోలీసులను సంప్రదించారు. బాలుడి ఫోటోను పోలీసులు చుట్టు పక్కల పోలీస్‌స్టేషన్‌లకు మిస్సింగ్‌ కేసుగా పంపించారు. రాత్రి సుమారు 10 గంటల సమయంలో సంబంధిత ఫొటోలో ఉన్న బాలుడు కనిపించాడని జగద్గిరిగుట్ట పోలీసులు బాలానగర్‌ పోలీసులకు సమాచారం అందించారు. బాలుడిని తల్లిదండ్రులకు బాలానగర్‌ పోలీసులు క్షేమంగా అప్పగించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు


పైప్‌లైన్‌ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి

గచ్చిబౌలి/శేరిలింగంపల్లి/రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీలను ఆదర్శవంతంగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని టీఎన్‌జీఓ కాలనీలో రూ.4.89 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్‌ నిర్మాణ పనులకు, నల్లగండ్ల హుడాకాలనీలో హిమసాయి టవర్స్‌ వరకు రూ.1.89 కోట్లతో చేపట్టే మంచినీటి పైప్‌లైన్‌ నిర్మాణ పనులకు, అలాగే శేరిలింగంపల్లి డివిజన్‌లోని శిల్పావ్యాలీ, మాధవహిల్స్‌కాలనీలో రూ.1.60 కోట్లతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్‌ నిర్మాణ పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు.

ఎమ్మెల్యే గాంధీ

అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యవసరం ఉన్న చోట, నిత్యం మురుగు పొంగుతున్న ప్రాంతాలలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేసేలా నాలాల విస్తరణ పనులు చేపట్టామని, ఇవి పూర్తయితే రాబోయే రోజుల్లో డ్రైనేజీ సమస్య తలెత్తదన్నారు. శేరిలింగంపల్లి, గచ్చిబౌలి కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్‌, గంగాధర్‌రెడ్డి, జలమండలి అధికారులు డీజీఎం సురేందర్‌రెడ్డి, మేనేజర్‌ సందీప్‌రెడ్డి, ఆయా కాలనీలవాసులు, కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కవలలకు పునర్జన్మ

కొండాపూర్‌ కిమ్స్‌ వైద్యుల ఘనత

గచ్చిబౌలి: ఛత్తీస్‌ఘడ్‌లోని బిలాస్‌పూర్‌లో నెలలు నిండక ముందే కవలలు (మగ)1400 గ్రాములు, 1500 గ్రాముల బరువుతో జన్మించారు. ఇన్‌ఫెక్షన్‌ కారణంగా ప్లేట్‌లెట్లు పడిపోవడంతో ప్రాణాపాయస్థితికి చేరడంతో ప్రత్యేక విమానంలో కొండాపూర్‌ కిమ్స్‌ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. నియోనటాలజీ విభాగం క్లీనికల్‌ డైరెక్టర్‌, పీడియాట్రిక్‌ సీనియర్‌ కన్సల్టెంట్‌ డాక్టర్‌ అపర్ణ చికిత్స వివరాలను వెల్లడించారు. రక్తంలో ఫంగల్‌ ఇన్‌ఫెక్షన్‌తో పాటు డ్రగ్‌ రెసిస్టెంట్‌ బ్యాక్టీరియా (కెలబిసిల్లా) ఇన్‌ఫెక్షన్‌ కారణంగా అవయవాలు సరిగ్గా పని చేయడం లేదన్నారు. కిడ్నీలు పనిచేయక పోవడంతో మూత్ర విసర్జన 24 గంటలు జరగలేదని, ఫంగల్‌ సెప్సిస్‌ కావడంతో ముక్కు ద్వారా సిపీఏపీ ఇవ్వాల్సి వచ్చిందన్నారు. రక్తంతో పాటు ప్లేట్‌లెట్లు ఎక్కించామని పేర్కొన్నారు. నెల రోజుల పాటు చికిత్స అనంతరం తల్లిపాలు తాగుతున్నారని, బరువు 2000 గ్రాములకు చేరారని తెలిపారు. కొండాపూర్‌ కిమ్స్‌ కడల్స్‌ ఐసీఏటీటీ బృందం డాక్టర్లు రాజశేఖర్‌, వంశీ, అరవింద, ప్రణీత, సునీతలు చికిత్స అందించారన్నారు. పిల్లలను డిశ్చార్జి చేశామని తెలిపారు.



ఇరుకు రోడ్లు.. ఇరువైపులా పార్కింగ్‌

- అంబులెన్స్‌, ఫైరింజన్‌కు దారి ఏదీ?
- రోజూ గొడవలు.. స్థానికులకు ఇబ్బందులు


పాపిరెడ్డినగర్‌లో ఇళ్లముందు రోడ్డుకు ఇరువైపులా పార్క్‌ చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలు

ఆల్విన్‌కాలనీ: అసలే ఇరుకు రోడ్లు.. ఆపై వాహనాల పార్కింగ్‌.. రోజూ వాహనదారుల వాగ్వాదాలు.. రోడ్డుకు ఇరువైపులా పార్క్‌ చేసిన వాహనాలతో చిన్నపాటి గొడవలతో మొదలై కొట్టుకునే పరిస్థితి నుంచి పోలీస్‌స్టేషన్‌ మెట్లు ఎక్కేవరకూ సాగుతోంది. ఏదైనా అనారోగ్యం.. ప్రమాదాలు సంభవించినపుడు బస్తీ ప్రజల ఇక్కట్లు వర్ణణాతీతం.. అంబులెన్స్‌, ఫైర్‌ ఇంజన్‌ వంటి అత్యవసర వాహనాలు సైతం రాలేని పరిస్థితి. కూకట్‌పల్లి సర్కిల్‌, శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని జగద్గిరిగుట్ట పరిసర ప్రాంతాల్లోని పాపిరెడ్డినగర్‌, ప్రగతినగర్‌, రిక్షా పుల్లర్స్‌ కాలనీ, దీనబంధు కాలనీ వెంకటేశ్వరనగర్‌, ఆస్‌బెస్టాస్‌ కాలనీ తదితర కాలనీలు, బస్తీల్లో ప్రణాళిక లేకుండా ఇష్టానుసారంగా .. జీహెచ్‌యంసీ అనుమతులు లేకుండా, పార్కింగ్‌ సౌకర్యం లేకుండా ఇళ్లను నిర్మించుకోవటం, అద్దెలకు ఇవ్వటంతో పార్కింగ్‌ సమస్య ఏర్పడుతున్నది. ఒక్కో ఇళ్లు 60–80 గజాల్లో నాలుగు నుంచి అయిదు అంతస్తుల వరకు నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో ఇంటిలో సుమారు 5 నుంచి 8 ద్విచక్ర వాహనాలు, కార్లు ఉండటంతో ఇళ్లముందు, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్‌ చేయటంతో గొడవలు జరుగుతున్నాయి. వాహనం ఎవరిదో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. అకస్మాత్తుగా ఎవరికైనా అనారోగ్యం వస్తే 108కు ఫోన్‌ చేసినా వాహనం రాలేని పరిస్థితి. సొసైటీ నిర్వాహకులు సొసైటీ మీటింగ్‌ల సమయంలో పార్కింగ్‌ లేని వారు కిరాయిదారులకు పార్కింగ్‌ సమస్య ఉంటుందని తెలియచేయాలని సూచించినప్పటికి పట్టించుకోకుండా కిరాయికి ఇవ్వటం సమస్య జఠిలంగా మారుతోంది. గతంలో కూకట్‌పల్లి, వివేకానందనగర్‌ డివిజన్‌ల పరిధిలోని పాపిరెడ్డినగర్‌, వెంకటేశ్వరనగర్‌, రిక్షా పుల్లర్స్‌ కాలనీలో గర్భవతుల కోసం అంబులెన్స్‌ రాలేక ఇక్కట్లు పడినట్లు బాధితులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు, జీహెచ్‌యంసి ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పార్కింగ్‌ చేయకుండా అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. అంబులెన్స్‌, ఫైర్‌ ఇంజన్‌ వంటి వాహనాలకు దారి ఇచ్చే విధంగా పార్క్‌ చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.



అత్యవసర వాహనాలు రాలేని పరిస్థితి



రాత్రి వేళల్లో ఇళ్లముందు, రహదారులపై ద్విచక్ర వాహనాలు, కార్లు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్‌ చేయటంతో అంబులెన్స్‌, ఫైర్‌ ఇంజన్‌ వంటి అత్యవసర వాహనాలు రాలేని పరిస్థితి. అనారోగ్య సమస్య వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఇంటి యజమానులు పార్కింగ్‌ సమస్య లేకుండా చూసుకోవలసిన అవసరం ఉంది. పోలీస్‌ ఉన్నతాధికారులు ప్రతి కాలనీలో అవగాహన కల్పించాలి.

–విక్కీ, స్థానికుడు